చిత్రలహరి

- గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రిలో ముచ్చటైన బొమ్మలు
- పిల్లలను ఆకట్టుకునేలా పెయింటింగ్స్



పిల్లల వార్డులో జంతువుల బొమ్మలు



పిల్లల వార్డులో ముచ్చటగొలిపే చిత్రాలు




పిల్లల ఓపీ బయట అందమైన చిత్రాలు



పిల్లల వార్డు వద్ద అలరిస్తున్న మిక్కీ మౌస్ బొమ్మలు



పిల్లల వార్డు బయట బొమ్మలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, పిల్లల వైద్యురాలు



బేబీ ఫీడింగ్ కార్నర్ వద్ద తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమన్న సంకేత చిత్రం

గోపాలపట్నం: కార్టూన్ బొమ్మలంటే అందరూ ఎంతో ఇష్టపడతారు. ముఖ్యంగా మిక్కీ మౌస్, డొనాల్డ్ డక్, టామ్ అండ్ జెర్రీ, యానిమల్స్ వంటి బొమ్మలు కనిపిస్తే పిల్లలు ఎంతో ముచ్చటపడుతుంటారు. వారి ఏడుపులు ఆపేసి సంతోషంగా ఎగిరి గెంతేస్తారు. పిల్లల్లో ఇదే ఆనందాన్ని చూసేందుకు గోపాలపట్నం 30 పడకల ఆస్పత్రిలో మంచి మంచి బొమ్మలు గీసే కార్యక్రమం చేపట్టారు. ఆస్పత్రి వాతావరణాన్ని ఆహ్లాదకరంగా.. ఆకర్షణీయంగా మార్చేశారు. ముస్కాన్ ప్రాజెక్టులో భాగంగా ఆస్పత్రి గోడలపై ముచ్చటైన చిత్రాలను తీర్చిదిద్దుతున్నారు. గోపాలపట్నం కమ్యూనిటీ ఆస్పత్రి ముస్కాన్ ప్రాజెక్టుకు ఎంపికైంది. దీని ద్వారా పిల్లల్లో ఆసక్తిని కలిగించేలా ఆస్పత్రికి వచ్చామనే ఆలోచన లేకుండా ఉంచేందుకు పలు రకాల పుస్తకాలు, ఆట వస్తువులు ఏర్పాటు చేయనున్నారు. తొలుత పిల్లల ఓపీ వద్ద, పిల్లల వార్డుల్లో, వార్డుల బయట ఇలా.. అనేక ప్రదేశాల్లో సందేశాత్మకమైన.. అందమైన బొమ్మలు వేశారు. వీటిని చూసిన వారంతా చాలా బాగున్నాయని మెచ్చుకుంటున్నారు.

క్లుప్తంగా

బాక్సింగ్‌లో అలేఖ్య ప్రతిభ



గోల్డ్ మెడల్, పతకాలు, సర్టిఫికెట్లతో బాక్సర్ అలేఖ్య

మల్కాపురం: ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ స్టేట్ సబ్ జూనియర్ గర్ల్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీల్లో మల్కాపురానికి చెందిన వి.అలేఖ్య ప్రతిభ చూపింది. 40 నుంచి 43 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. నగరంలో ఇటీవల జరిగిన పోటీల్లో అలేఖ్య సత్తా చాటడంతో శుక్రవారం ఆమెను పలువురు అభినందించారు. అలేఖ్య ఇంటికి పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ బాక్సర్లు వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

జాబ్‌మేళాలో 49 మంది ఎంపిక



అభ్యర్థులకు సూచనలిస్తున్న సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), శాంతి (టెక్నికల్) తెలిపారు. సుమారు 9 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 268 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 78 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 49 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. నిరుద్యోగ యువతకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఆయన అన్నారు.

జిందాల్ పార్కు అధ్యక్షుడిగా ఆల్ఫా కృష్ణ



విశాఖ విద్య: ఎస్‌ఏడీ సెంటర్‌లోని జిందాల్ భవన్ వద్ద హైవే గ్రీన్ బెల్ట్ పార్కు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా విశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ బీ.ఎస్.కృష్ణ(అల్ఫా కృష్ణ) ఎన్నికయ్యారు. జీవీఎంసీ 52 వార్డు పరిధిలోని అంబేడ్కర్ నగర్, శాంతినగర్, ఎస్‌ఏడీ పరిసర కాలనీల ప్రజానీకానికి ఈ పార్కు ఎంతో ఉపయోగపడనుంది. పిల్లలకు ఆట పరికరాలతో పాటు, వ్యాయాయ పరికరాలు, వాకింగ్‌ట్రాక్ ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేసే క్రమంలో కమిటీ ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ వెల్లడించారు. కాలనీవాసులు, వాకర్స్ ఆమోదంతో కమిటీ అధ్యక్షుడిగా కృష్ణను ఎంపిక చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలు, జరిమానా

గోపాలపట్నం: గోపాలపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వారికి జరిమానాలు జైలు శిక్షలు విధించారు. గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్‌ఐ కె. కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల మద్యం సేవించి వాహనం నడిపిన వారిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. 15 మందిని 2వ స్పెషల్ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం హాజరు పర్చారు. వీరిలో జడ్జి కె. మురళీకృష్ణ 12 మందికి రూ.33వేలు జరిమానా, మరో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. మరో వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష రూ.200 జరిమానా విధించారు.

సివిల్ ఇంజినీరింగ్ కళాశాలలో సదస్సు

ఏయూ క్యాంపస్: ఏయూమహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్మాణిక 2కే24 సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. కె.రాజగోపాల్ ,ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె భట్టి, కన్వీనర్ జి.శిరీష ప్రసంగించారు.

సుందర నగరంగా తీర్చిదిద్దుతాం

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్
- రూ.65 లక్షల పనులకు ప్రారంభోత్సవం



వుడా పార్కును ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, పక్కన మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ

విశాఖ విద్య: విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నిధులు కేటాయింపు చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చెప్పారు. 52వ వార్డులో రూ.65 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్. కృష్ణతో కలసి శుక్రవారం ప్రారంభించారు. హైవే జిందాల్ భవన్ వద్ద గ్రీన్ బెల్ట్ పార్క్, మద్రిపాలెం వుడా లే అవుట్ గ్రీన్ బెల్ట్‌లో ఐరన్ గ్రిల్స్ , లైటింగ్ మొదలైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వార్డులో ప్రజలకు ఉపయోగకరమైన 18 పార్కులను, గ్రీన్‌బెల్ట్ లను అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సహకారంతో నగర పాలక సంస్థ అధికారుల సమన్వయంతో వార్డుకు అధిక మొత్తంలో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పారు. వార్డు ప్రాధాన్యత దృష్ట్యా నిధులు కేటాయింపుకు సహకరించిన ఆడారి ఆనంద్ కుమార్‌కు ఈ సందర్భంగా ప్రజానీకం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ అవసరాలను తీర్చే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులను కూడా పూర్తి చేశారన్నారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వార్డు ప్రజానీకం రుణపడి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మిగిలి ఉన్న పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 డిప్యూటీ ఇంజినీర్ ఏడుకొండలు, ఏఈ ఉష, వైఎస్సార్ సీపీ నాయకులు జియ్యాని విజయ్, ఎలియన్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొలుసు నాగేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

58వ వార్డులో ఇంటింటి ప్రచారం



58వ వార్డు పిలకవానిపాలెంలో ప్రభుత్వ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరిస్తున్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, నాయకులు కోటా కృష్ణ,సత్యనారాయణరెడ్డి తదితరులు పార్టీలు,కులాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటికి నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందించారని వివరించారు.అలాంటి నాయకుడికి మళ్లీ వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి మద్దతుగా నిలవాలని కోరారు. వచ్చే ఐదేళ్లలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేస్తారని వివరించారు.

'పశ్చిమ'లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం

జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు



కార్యకర్తలతో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు



సమావేశంలో పాల్గొన్న 91వ వార్డు నాయకులు, కార్యకర్తలు

గోపాలపట్నం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయ పతాక ఎగురువేయడానికి అంతా సమష్టిగా పని చేద్దామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో 91వ వార్డు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ఎన్నికలు అయ్యేవరకు ప్రతి కార్యకర్త అవిశ్రాంతంగా పని చేయాలని.. ప్రతి ఓటరును కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధిని సమపాళల్లో చేసిందని వివరించాలన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ సగన్ మోమన్ రెడ్డి అమలు చేసిన పథకాలు అందుకున్న ప్రతీ లబ్ధిదారు వైఎస్సార్ సీపీకి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం మారితే మోసగాళ్లు వస్తారని ఇప్పుడు పొందిన పథకాలు కోల్పోతారని వివరించాలన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 92 అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రసీదు ఉంటే నష్టపరిహారం పొందే వీలు



మాట్లాడుతున్న తనూజా రెడ్డి

సీతంపేట: ఏదైనా వస్తువు కొనుగోలు చేసినపుడు దాని రసీదు పొందాలని జిల్లా వినియోగదారుల మండలి అధ్యక్షురాలు తనూజా రెడ్డి సూచించారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. కొనుగోలు రసీదు ఉంటే రెండేళ్లలోపు నష్టం జరిగితే నష్టపరిహారం కోసం వినియోగదారుల కౌన్సిల్‌లో కేసు వేయవచ్చని తెలిపారు. రెండేళ్లు దాటితే అందుకు తగు కారణం చూపి కేసు వేయవచ్చన్నారు. జిల్లా వినియోగదారుల మండలి ద్వారా రూ.5 లక్షల లోపు, రాష్ట్ర వినియోగదారుల మండలి ద్వారా రూ.2 కోట్ల లోపు, అంతకు మించి కేంద్ర వినియోగదారుల మండలి ద్వారా న్యాయం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి, ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



గుల్లలపాలెంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బద్రీనాథ్, ధనలత తదితరులు



మల్కాపురంలో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ కొణతాల సుధ తదితరులు



నందమూరినగర్‌లో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మల్కాపురం: గీతాంజలి మృతికి చింతిస్తూ, ఆమె మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచనల మేరకు కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు మళ్ల ధనలత ఆధ్వర్యంలో 60వ వార్డు ఇందిరా కాలనీ నుంచి స్థానిక గ్యాస్ గొడౌన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ లబ్ధి పొంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పుకున్న గీతాంజలిని ఎల్లో బ్యాచ్, పిల్లసేనలు సోషల్ మీడియా వేదికగా వేధించి, ఆమె జీవితాన్ని బలిగొని, పిల్లలను తల్లి లేనివారిని చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమాయకులైన మహిళలను మానసికంగా వేధించడమే టీడీపీ, జనసేన శ్రేణుల లక్ష్యమన్నారు. వారికి ఈ రాష్ట్రం సురక్షితంగా ఉండటం ఇష్టం లేదని, వారికి నచ్చని వారిని ఎవరైనా పొగిడితే వారి పతనం ఆ రెండు పార్టీల వారు చూస్తారని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా గీతాంజలిపై లేనిపోని ఆరోపణలను చేస్తుంటే టీడీపీ, జనసేనలు నేటికీ నోరు మెదపకపోవడం వెనుక రహస్యం ఏమిటో జనం అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.వి.ఎల్.నరేష్, కొల్లి నూకరెడ్డి, శరగడం పత్నీరావు, బిల్డర్ శ్రీను, మనోహర్, భీమ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన..

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం నుంచి ఆర్‌కే పురం వరకు గీతాంజలి మృతికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ కొణతాల సుధ మాట్లాడుతూ గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు ధనలత, మంగ, స్వప్న, నూకరెడ్డి, చట్టి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: గీతాంజలి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి బండారు వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు నందమూరినగర్‌లో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.గీతాంజలి ఆత్మకు శాంతి కలగాని ఆకాంక్షించారు. జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజల్లో భయభ్రాంతుల్ని సృష్టించేందుకు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని వాపోయారు. ఇలాంటి విద్రోహకారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు మామిడి గౌరి, దుంప వెంకటలక్ష్మి, నూనెల కుమారి, కె. శ్రీదేవి, సాలాపు విజయలక్ష్మి, పాల వెంకటలక్ష్మి, బండారు నాగేశ్వరరావు, దవళ మోహన్ పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

సీతంపేట: ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్లకోమా వ్యాధిపై అవగాహన కోసం రామాటాకీస్ నుంచి సత్యం సెంటర్ వరకు జరిగిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా వైద్య విద్యార్థులు ఆస్పత్రి ఆవరణలో కంటి ఆకృతిని ప్రదర్శించారు. కార్యక్రమంలో నేత్ర వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి, వైద్యులు రమణ, ప్రేమలత, పద్మావతి, వాణిశ్రీ, సౌజన్య, శ్రీలక్ష్మి, పీఎంవోవోలు ఉమా శ్రీనివాస్, సురేష్, సుబ్బలక్ష్మి, సుజాత, జూనియర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉక్కు' సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే..

కూర్మన్నపాలెం: ప్రజల సంకల్పం బలంగా ఉన్నంత కాలం విశాఖ ఉక్కు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా, చివరికి తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో 1128వ రోజు సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ, వాటిని అమలు చేస్తున్న అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

ఇద్దరు గంజాయి నిందితులకు రిమాండ్

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 14 కేజీల గంజాయిని విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరిని పట్టుకుని రిమాండ్‌కు తరలించిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన రాజ్‌కుమార్, కె.డేవిడ్‌రాజు అనే ఇద్దరు వ్యక్తులు కంచరపాలెం ధర్మానగర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా సంచరిస్తుండగా.. ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద ఉన్న రెండు బ్యాగుల్లో 7 ప్యాకెట్లు(14 కేజీలు) గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.భాస్కర్‌రావు నేతృత్వంలో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మద్రిపాలెం: మహిళా శిశు సంక్షేమ ఐసీడీఎస్ విశాఖపట్నం మద్రిపాలెం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తునట్టు ఐసీడీఎస్ సీడీపీవో రమణికుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 ఆయా పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఆమె చెప్పారు. స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత, 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు నోటిఫికేషన్ దరఖాస్తు ఫారాన్ని వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ధ్రువపత్రాల నకళ్లను గెజిట్ అధికారిచే అటెస్టేషన్ చేయించి వాటిని నేరుగా గానీ, పోస్టు ద్వారా గానీ ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మద్రిపాలెం ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని రమణికుమారి కోరారు.



18 నుంచి త్రిశక్తి ఆలయ ప్రారంభ వేడుకలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు లక్ష్మీ పురంలో సుమారు రూ.1.5 కోట్లతో నిర్మించిన త్రిశక్తి ఆలయ ప్రారంభోత్సవాన్ని ఈ నెల 18 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అవిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా 108 కలశాలతో శోభాయాత్ర, చండీ హోమం, సారె ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో కుచ్చర్లపాటి రామరాజు, సెక్రటరీ సిరసపల్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

మహారాణిపేట: ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు, ఇతర అంశాలపై సూర్యాబాగ్‌లోని జోన్–4 కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ బాధ్యులకు శుక్రవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తూర్పు నియోజవర్గ పరిధిలో పని చేసే ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు), ఎఫ్ఎస్‌టీ(ఫ్లయింగ్ స్క్వాడ్ టీం), ఎస్ఎస్‌టీ(స్టాటిక్ సర్వేయలెన్స్ టీం, వీఎస్టీ(వీడియో సర్వేయలెన్స్ టీం), వీవీటి(వీడియో వ్యూయింగ్ టీం) అధికార బృందాల సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ అధికారులంతా ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజూ జరిగే సంఘటలకు సంబంధించి నివేదికలు ఇవ్వాలన్నారు. అవసరమైన చోట్ల చెక్ పోస్టులు పెట్టాలని, తరచూ తనిఖీలు నిర్వహించాలని చెప్పారు.

ముస్లింల జుమా నమాజ్



మసీదులో నమాజ్ ఆచరిస్తున్న ముస్లింలు

మద్రిపాలెం: రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలను పురస్కరించుకుని మొదటి శుక్రవారం కావడంతో మద్రిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్–ఈ–ఖదీర్ వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున చేరుకుని పవిత్ర జుమా నమాజ్‌ను ఆచరించారు. హఫీజ్(మత గురువు) ఖురాన్ పఠించి సూక్తులను వివరించారు. సాయంత్రం మగ్రిబ్ నమాజ్‌కు ముందు దీక్షను విరమించారు. కార్యక్రమాన్ని మస్జిద్ కమిటి అధ్యక్షుడు మున్న పర్యవేక్షించారు.